TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 228 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.15.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

# గృహ అవసరాలకు ఇబ్బంది లేదు

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:తెలంగాణలో గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలిపారు. బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, అవసరం లేకున్నా ముందుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని సూచించారు. ఉద్దేశపూర్వకంగా గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గ్యాస్ కంపెనీల డిస్ట్రిబ్యూటర్లతో మంత్రి సమావేశమయ్యారు. గ్యాస్ కొరతపై సమీక్షించారు. కస్టమర్లకు బుకింగ్ కావడం లేదని మంత్రి ప్రశ్నించగా.. ఓవర్ లోడ్ వల్ల బుకింగ్స్ కావడం లేదంటూ డిస్ట్రిబ్యూటర్లు సమాధానమిచ్చారు.

ఆయిల్ కంపెనీల సమ్మె వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారనీ, 1.3 కోట్ల గృహ వినియోగదారులు ఉన్నారని తెలిపారు. 7.5 లక్షల కమర్షియల్ సిలిండర్ల వినియోగదారులు ఉన్నారని చెప్పారు. నెలకు సగటున 60లక్షల సిలిండర్లను వినియోగిస్తున్నారని తెలిపారు. కమర్షియల్ సిలిండర్ల కొరత ఏర్పడిందన్నారు. గృహ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తామన్నారు. రెండురోజులుగా 2.3 లక్షల సిలిండర్లు సరఫరా చేసినట్టు తెలిపారు. సివిల్ సప్లై భవన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఎవరైనా కృత్రిమ గ్యాస్ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344కు కాల్ చేయాలని కోరారు.

కమర్షియల్ సిలిండర్ల కొరత

రాష్ట్రంలో కమర్షియల్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు 23వేల సిలిండర్లు



సరఫరా కావాల్సి ఉండగా, కేవలం 6,200 మాత్రమే సరఫరా అవవుతున్నాయని చెప్పారు. దీని ప్రకారం 20శాతమే వస్తున్నాయని తెలిపారు. అందులో పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, ప్రభుత్వ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వానికి తాను లేఖ రాసినట్టు వివరించారు.

పర్యవేక్షణ కోసం 24/7 కమాండ్ కంట్రోల్ రూమ్

రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ పంపిణీని పర్యవేక్షించేందుకు 24/7 కమాండ్ కంట్రోల్ సెంటర్ పని చేస్తున్నదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చెప్పారు. ముడి చమురు, ఎల్పీజీ సరఫరా అంతరాయాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ కొరత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని వాహనాలకు రియల్–టైమ్ జీపీఎస్ ట్రాకింగ్‌ను ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. ట్రాకింగ్ చేస్తున్న తీరును ఆయన మీడియాకు వివరించారు.

# మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదు

రంగారెడ్డి అమృత్ తెలంగాణ: మూసీ సుందరీకరణకు, అభివృద్ధికి తాము ఏమాత్రం వ్యతిరేకం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు వ్యతిరేకమని, కచ్చితంగా అవినీతిని అడ్డుకుంటామని తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌సాగర్ ప్రాంతంలో 'మూసీ పునరుజ్జీవం–పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' అనే కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాజేందర్‌నగర్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భం గా కేటీఆర్ మాట్లాడారు.. పేదల భూముల విలువ ' జీరో ' అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు విలువ లేదని అన్నారు. పేదల భూముల విలువ రూ. లక్షా 50 వేల కోట్లని, ఆ విలువైన భూములపై కన్నేసిన ముఖ్యమంత్రి .. మూసీ ప్రణాళికను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. 'రాష్ట్ర ప్రభుత్వం బఫర్ జోన్ పేరు చెప్పి ప్రజలను భయపెట్టి వారి ఇండ్లను కూలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డి కుంట బఫర్ జోన్‌లో ఉన్నది నిజం కాదా, దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు. సీఎం సోదరుడి ఇల్లు హైదరాబాద్‌లో బఫర్ జోన్‌లో ఉంది. మంత్రుల ఫామ్‌హౌస్‌లు, ఇండ్లు కూడా బఫర్ జోన్‌లో ఉన్నాయి. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు' అని కేటీఆర్ ప్రశ్నించారు. 20ఏండ్ల కింద కట్టుకున్న అపార్ట్‌మెంట్లను, ఇండ్లను కూలగొడతా అంటున్న ముఖ్యమంత్రి ఇప్పుడు మూసీ బఫర్ జోన్‌లో కడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థల అపార్ట్‌మెంట్‌లను మాత్రం ముట్టుకోను అనడంలో అర్థం ఏంటనీ ప్రశ్నించారు. ఒకటి, రెండు అపార్ట్‌మెంట్ వాసులకు ఇండ్లు కట్టించి తగిన స్థలం ఇస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి, అదే సూత్రం అదే న్యాయం బాధితులందరికీ వర్తింపజేస్తారా అనే ప్రశ్నకు సమా ధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డికి తమ కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఎంతో అనే అంశంపై అవగాహన కూడా లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం




రూ.16వేల కోట్లతో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఎలాంటి డీటెయిల్స్ ప్లానింగ్ రిపోర్టు (డీపీఆర్) లేకుండా సోషల్ ఇంఫాక్ట్ స్టడీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు, ప్రజలతో ఎలాంటి చర్చలు లేకుండా ఇండ్లను కూలగొడతామని భయాందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# థర్డ్ పార్టీ అప్లికేషన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.

తెలియని అప్లికేషన్లలకు అన్ని అనుమతులను ఇవ్వరాదు.
సైబర్ నేరాలకు ఆతిథ్యమవుతున్న థర్డ్ పార్టీ అప్లికేషన్లు.
డాటా చోరీ, బ్లాక్మెయిలింగ్, మొబైల్ హ్యాకింగ్, సోషల్ మీడియా హాకింగ్ కు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు.
సైబర్ నేరాలకు వెంటనే 1930కు సంప్రదించాలి.
ఈవారం జిల్లాలో 14 ఫిర్యాదులు నమోదు.
జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాల నిర్వహణ.
ఏఐ వీడియో మెసేజెస్,సోషల్ మీడియా ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్,
ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బిజినెస్ ఫ్రాడ్, ఫేక్ కాల్స్, బ్లాక్మెయిలింగ్, డిజిటల్ అరెస్ట్ లాంటి నూతన సైబర్ నేరాలు.
ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో "ఖాకీ కిడ్స్" ద్వారా అవగాహన కార్యక్రమాలు.

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ భారతదేశంలో సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు మితిమీరి అమాయకులను మోసం చేస్తున్న సందర్భంలో ప్రజలు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. అప్రమత్తతోనే, అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని జిల్లాలోని సైబర్ బృందాలచే ప్రతి పోలీస్ స్టేషన్ల వారిగా నూతనంగా ఏర్పాటు చేయబడిన "ఖాకి కిడ్స్" అనే కార్యక్రమంలో ద్వారా పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజు జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్న తీరు ప్రస్తుత సమాజంలో ప్రజలు మోసపోతున్న సందర్భాలపై వివరణను అందించారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కు సంప్రదించాలని, లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు తమ ఫిర్యాదులను నమోదు చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనదని, గంటలోపు ఫిర్యాదు చేసిన వారి నగదు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సమాజంలో ముఖ్యంగా థర్డ్ పార్టీ అప్లికేషన్లను వినియోగిస్తూ మొబైల్ ఫోన్లో వాటికి పూర్తిగా అనుమతులను ఇవ్వడం వల్ల మొబైల్ ఫోన్ డాటా అనేది చోరీకి గురవుతుందని, దానివల్ల సామాన్య ప్రజల వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లి బ్లాక్ మెయిల్ కి పాల్పడే అవకాశం ఉన్నందున థర్డ్ పార్టీ అప్లికేషన్లు వినియోగాన్ని నిరోధించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వెబ్సైట్లను అప్లికేషన్లను ఇన్స్టాల్ చేసుకోకుండా ఉండాలని తెలిపారు. ఈ అప్లికేషన్లలో ముఖ్యంగా లోన్ ఆప్స్, ఏపీకె ఫైల్స్ ఉంటాయని తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియా నందు జాబ్ ఫ్రాడ్, వర్క్ ఫ్రం హోం, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బిజినెస్ ఫ్రాడ్, ఏఐ ఆధారిత వీడియో మెసేజ్ లతో సందేశాలతో కూడిన ఫ్రాడ్, కస్టమర్ కేర్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాంటివి నూతన సమాజంలో ప్రస్తుతం చలామణిలో ఉన్న నేరాలు వీటిని వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు వస్తాయని అత్యాశ చూపి మోసగాళ్లు అమాయకులను, యువతను, విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తుంటారని తెలిపారు. సమాజంలో అధికారుల పేరుతో మోసం చేసే ప్రయత్నం, అధికారి పేరుతో డబ్బులు పంపాలనే ప్రయత్నం సైబర్ నేరగాళు చేస్తుంటారని బాధితులు ఎలాంటి వాటిని నమ్మకుండా నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు.

జిల్లాలో నమోదైన పలు సైబర్ క్రైమ్ వివరాలు

ఆదిలాబాద్ పట్టణంలోని ఒక బాధితుడి మై ఫినో బ్యాంక్ ఆప్ ద్వారా 5500 థర్డ్ పార్టీ అప్లికేషన్లను వినియోగించడం వల్ల పోగొట్టుకోవడం జరిగింది.

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఒక మహిళకు ఇన్స్టాగ్రామ్ నందు పార్ట్ టైం జాబ్ అంటూ చిన్న మొత్తాల్లో




అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఇన్వెస్ట్ చేసి ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని మహిళ వద్దనుండి 17300 రూపాయలను మోసం చేయడం జరిగింది.

నాగ్పూర్ కు చెందిన మహిళకు ఫోన్ ద్వారా మాయమాటలు చెప్పిన కేటుగాళు మహిళ అకౌంట్ నుండి దాదాపు 70 వేల రూపాయలను మోసం చేయడం జరిగింది.

నేరడిగొండకు సంబంధించిన వ్యక్తికి ఎస్బిఐ నుండి ఫోన్ చేస్తున్నా మీ ట్రాన్సాక్షన్ లేట్ అయింది మీ అకౌంట్ కు సంబంధించిన వివరాలు తెలియజేయగలరు అంటూ నమ్మించగా బాధితుడు వివరాలు చెప్పడంతో 50 వేల రూపాయలను మోసపోవడం జరిగింది.

నేరేడిగొండ మహిళ స్క్రీన్ షేరింగ్ ద్వారా మోసగాళ్ల చేతిలో మోసపోయి దాదాపు లక్ష రూపాయలు మోసపోవడం జరిగింది.





## గృహ ప్రవేశానికి హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ నియోజకవర్గం తేజాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి – కృష్ణవేణి దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై అభినందనలు తెలిపిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారివెంట సీనియర్ నాయకులు కూనింటి దామోదర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేత

పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కు ను పాఠశాల యజమాన్యానికి అందజేసిన శివశంకర్ బచ్చువార్.........



శ్రీ శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కును పాఠశాల యజమాన్యానికి అందజేస్తున్న శివశంకర్ బచ్చువార్

నిర్మల్ జిల్లా బైంసా మార్చ్ 14 అమృత్ తెలంగాణ బైంసా శ్రీ శిశు మందిర్ పాఠశాలకు శనివారం రోజు శివశంకర్ బచ్చు వార్, నాన్న జ్ఞాపకార్థం కి.శే శ్రీ కాశీ నాథ్ బచ్చువార్‌లి, పేరుమీద అదనపు తరగతిగదుల నిర్మాణం నిమిత్తం ఒక లక్ష రూపాయల చెక్కును అందించారు, ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన వేలాది మంది విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగారని అన్నారు, ఉత్తమ విలువలు, నడవడి, ప్రవర్తన, విజ్ఞానం,గౌరవం, దేశ సంస్కృతి పట్ల, నైతిక విలువలు, సమాజానికి అందించిన ఈ విద్యా సంస్థ యొక్క ప్రత్యేకలు,మంచి మార్గంలో పయనిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నరాని కొనియాడారు, శిశు మందిరాల లక్ష్యం, విద్యార్థుల సర్వాంగీన వికాసం, దేశభక్తి ,అనేక సేవా కార్యక్రమాలు లో సేవలు అందిస్తున్న స్వంచద ఏకైక విద్యా సంస్థలు అని అన్నారు, సమాజ నిర్మాణానికి రాబోయే నవతార నిర్మాణం చేయడానికి విద్యాదానం కంటే మించిది ఏది లేదు , ప్రాచీన భారతీయ సంస్కృతి మాతృభూమి పట్ల మన కర్తవ్యాన్ని నిర్వహించుకోవాలని ,శిశు మందిరాల అభివృద్ధికి విరాళం అందించడం ఆనందంగ ఉందని, శిశు మందిరాల పాఠశాలల ను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు, ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్ , పాఠశాల అధ్యక్షులు డి.శ్రీధర్, సమితి అధ్యక్షులు శివకుమార్ బచ్చువార్,సమితి కార్యదర్శి నూకల సురేష్, కార్యదర్శి పేండపు కాశీ నాథ్,సహకార్యదర్శి తోట రాము కోశాధీకారి ముత్యపు వార్ రాజ్ గంగాధర్, గుజ్జులవార్ లక్ష్మణ్ సభ్యులు రావుల పోశెట్టి, పేరుగు నవీన్, ప్రధానా ఆచార్యులు శ్రీరాముల గంగాధర్ పాల్గొన్నారు

# జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు..ప్రజల్లో ఉన్న భయాలు అధికారులు తొలగించాలి:

## పెండింగ్ భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సంబంధిత అధికారులతో జూమ్ కాల్ లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్,



తాసిల్దార్లతో జూమ్ కాల్ లో కలెక్టర్

నిర్మల్ జిల్లా మార్చ్ 14 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రజల ఆందోళనలు తొలగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ నుండి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా, పలు రెవెన్యూ అంశాలపై తహసిల్దార్లతో జూమ్ కాల్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయంలో ప్రజల భయాలు తొలగించాలని పేర్కొన్నారు. గృహావసరాల గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని అన్ని మండలాల్లో పకడ్బందీగా అమలు పరచాలని పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాలలో అధికారులు స్వయంగా పాల్గొంటూ, ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో భూభారతి దరఖాస్తులు పెండింగ్లో ఉంచకూడదని పేర్కొన్నారు. ఆయా పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం చేయకూడదని వివరించారు. మండల స్థాయి అధికారులంతా ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో, జూమ్ కాల్ ద్వారా జిల్లా ఎస్పీ జానకి షర్మిల పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటి ని సందర్శించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.



బాసర ఐఐఐటి ని సందర్శించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,కు సన్మానించిన త్రిబుల్ ఐటీ వీసీ అధికారులు



త్రిబుల్ ఐటీ లో సంబంధిత అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్

నిర్మల్ జిల్లా బాసర మార్చ్ 14 అమృత్ తెలంగాణ బాసర ఐఐఐటి ని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా, ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ, వర్సిటీలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందో లేదో అధికారులను అడిగారు. విద్యార్థుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. మహిళా విద్యార్థుల కొరకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందిని నియమించుకునే ప్రక్రియలో తప్పనిసరిగా రిజర్వేషన్ పద్ధతిని పాటించాలని ఆదేశించారు. వివిధ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ, వారికి అందిస్తున్న వసతులు, వారికి ఉన్న సమస్యలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు అధికారులు, చైర్మెన్, సభ్యులను సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి, వైస్ చాన్స్ లర్ గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు... మండలాల్లో గ్యాస్ ఏజెన్సీల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు.




గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేస్తున్న అధికారులు







నిర్మల్ జిల్లా మార్చ్ 14 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు శనివారం మండలాల్లో అధికారులు గ్యాస్ ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. తహసిల్దార్లు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఏజెన్సీలలో తనిఖీలు చేశారు. ఆయా మండలాల్లో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల్లో గల స్టాక్, అమ్మకానికి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. గోదాములలో గల సిలిండర్లను పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితులలో సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు సిలిండర్లను అందించాలని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో అమ్మిన, పక్కదారి పట్టించిన, కృత్రిమ కొరత సృష్టించిన, కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు కొరకు వచ్చిన ప్రజలతో పలువురు అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, తగినంత స్టాక్ అందుబాటులో ఉందని, ప్రజల అవసరాల మేరకు సిలిండర్లను అందిస్తామని వారికి తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల విషయంలో భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని వివరించారు.

# కమర్షియల్ వ్యాపారాలకు రాయితీ సిలిండర్

అచ్చంపేట అమృత్ తెలంగాణ: ఇంట్లో గృహావసరాలకు ఉపయోగించే వంట గ్యాస్ రాయితీ సిలిండర్ లు అచ్చంపేట పట్టణంలో బహిర్గతంగా కమర్షియల్ వ్యాపారాలకు వినియోగిస్తున్నారు. అక్రమ వ్యాపారాల పైన పౌరసరఫరాల శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణ వివిధ రెస్టారెంట్లు, హోటల్స్ లలో, కొన్ని వెల్డింగ్ షాప్ లలో ప్రధాన రహదారి గప్ చిప్ బండ్లు, ఇతర చిరు వ్యాపారాలు సైతం నిబంధనలకు విరుద్ధంగా రైతు గ్యాస్ వినియోగిస్తున్నారు. రాయితీ వంట గ్యాస్ సిలిండర్లు పక్క దారి పట్టకుండా తనిఖీలు చేయవలసిన పౌరసరఫరాల శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పట్టణంలో జోరుగా చర్చ జరుగుతుంది. వంట గ్యాస్ అక్రమంగా వినియోగిస్తున్న వ్యాపారుల నుండి పౌర సరఫరా ల శాఖ అధికారులు ప్రతినెల మామూలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

## పట్టణంలోని సోమవార్ పేట్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.





పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సెంటర్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్

నిర్మల్ జిల్లా మార్చ్ 14 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. శనివారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనందున, పట్టణంలోని సోమవార్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు పరీక్షా గదులను తిరుగుతూ, పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని చూశారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, లైటింగ్, త్రాగునీరు, తదితర మౌళిక సౌకర్యాలు కల్పించారో లేదో పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, పరీక్ష కేంద్రంలో కేటాయించిన విద్యార్థుల సంఖ్య, హాజరైన విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, తదితర అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాసేలా పటిష్ట ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా పరీక్షల ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని పటిష్ట ఏర్పాట్లు చేశామని వివరించారు. ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయని, అన్ని పరీక్షలను పకడ్బందీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రం తనిఖీలో డిఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ పనులను వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో ప్రతిపాదించిన ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్కు సంబంధించిన భూ సేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జ్ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత జాబితాలో ఉందని, ముఖ్యమంత్రి కార్యాలయం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. చనాక- కోరట ప్రాంతంలో మొత్తం భూమి అందుబాటులో ఉండగా, అందులో కొంత భాగం వివిధ సర్వే నంబర్లలో సాగు జరుగుతున్నట్లు అధికారులు నివేదించినట్లు చెప్పారు. సాగులో ఉన్న భూములు, రోడ్లు, ఇతర గోదాములను మినహాయించి ఇండస్ట్రియల్ పార్క్కు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా డ్రోన్ సర్వే పూర్తి చేసి, ఈ నెల చివరి నాటికి క్షేత్రస్థాయిలో భూమి కొలతల ప్రక్రియను ముగించాలని గడువు విధించారు. పట్టాదారులు, సాగుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ మొదటి వారంలోపు భూ సేకరణకు సంబంధించిన తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, ఆర్ అండ్ బి ఈఈ నర్సయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, సంబంధిత మండల తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై జిల్లా కలెక్టర్ సమీక్ష: రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా






సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఓటరు మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాల బి.ఎల్.ఓలు, సూపర్వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మ్యాపింగ్ పురోగతిపై ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2002 నాటి ఓటరు జాబితా, ప్రస్తుత జాబితాను పోల్చి చూస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. 30 శాతం కంటే తక్కువ మ్యాపింగ్ ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు తమ తరపున బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించి, వారికి సంబంధించిన జాబితాలను అందజేయాలని కోరారు. బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలు సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం ఫారం-6, ఫారం-8 సమర్పించేటప్పుడు అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో ఏవైనా సమర్పించవచ్చని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆధార్ కార్డును గుర్తింపు కార్డుగా పరిగణిస్తున్నామని వివరించారు. ఇంటింటి సర్వే సమయంలో ఇంట్లో ఎవరు లేని పక్షంలో బి.ఎల్.ఓలు కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, ఆదిలాబాదు పట్టణం, గ్రామీణ, మావల మండలాల తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, వేణు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు పంచాపూల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఓలు, సూపర్ వైజర్లు, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో నూతనంగా మంజూరు అయిన రూ. 2 కోట్ల 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మరియు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు త్వరతరగతిన పూర్తి చేసి ప్రజలు తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# గ్యాస్ సిలిండర్ల కొరత లేదు : జిల్లా కలెక్టర్ రాజర్షి షా








అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో గృహ అవసరాలతో పాటు విద్యాలయాలు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్.పీ.జీ. సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, చమురు కంపెనీల సేల్స్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతిరోజూ బుకింగ్, సరఫరా వివరాలపై నివేదిక సమర్పించాలని డీలర్లను ఆదేశించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, వసతి గృహాలు, అనాధ శరణాలయాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గృహ అవసరాలకు కేటాయించిన డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించినా లేదా అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టేందుకు పౌర సరఫరాల అధికారులు, డి.టి.లు, ఎస్.ఐ.లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో డెలివరీ అందాలని, డెలివరీ బాయ్స్ సిలిండర్లను దారి మళ్లించకుండా డీలర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే, సిలిండర్లలో గ్యాస్ తూకం కచ్చితంగా ఉండాలని, తూనికల కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు చమురు కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించి ప్లా+ గ్యాస్ సిలిండర్ల నిల్వలు, ఆన్లైన్ బుకింగ్, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సురేందర్, అటవీశాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు, డీలర్లు, పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాలి

## పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా



పర్యవేక్షణ చేస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డులో ఉన్న సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల–2 కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి గదిని తిరుగుతూ పరీక్ష జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు, బెంచీలు వంటి కనీస మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? అని స్వయంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీస్తూ.. హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. "విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే, పరీక్షలు ముగిసే వరకు ఇదే అప్రమత్తత కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా 13వ జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## రక్తదాన శిబిరం ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు,బిస్కెట్లు పంపిణీ.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ మార్చి 14:జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మెట్ పల్లి పట్టణ జనసేన పార్టీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి, వివేకానంద విగ్రహానికి,పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లలను పంపిణీ చేయగా, రాధ్య బ్లడ్ బ్యాంక్ లో రక్తదాన శిబిరం నిర్వహించగా జనసేన సైనికులు,పవన్ కళ్యాణ్ అభిమానులు సుమారు 60మంది స్వచ్ఛందగా రక్తదానం చేశారు. అయ్యప్ప గుడి ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. అనంతరం రోడ్డు పైన ఉండే నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందు తీసుకెళ్తామని,అలగే రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో జనసేన జెండా ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గారి నాయకులు ఎలుగందుల అజయ్ కుమార్,బండి రమాదేవి,

మ్యాదరపు మారుతి,అబ్బారి ఆనంద్ రాజ్ గౌడ్,కోటగిరి అరుణ్ గౌడ్,వన్నెల రాకేష్,కదరి శ్రీకాంత్, పత్రె సంతోష్,రాంప్రసాద్, యూసుఫ్ నగర్ ఉపసర్పంచ్ బసవేని రమేష్,మణి సాయి,ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా






ఆవిష్కరిస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మారుమూల గ్రామాల నుంచి వెలువడుతున్న సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించి వాటిని పారిశ్రామిక స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 40 మందికి పైగా యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులు, ఆలోచనలను ప్రదర్శించారు. ముఖ్యంగా వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు, పర్యావరణహిత ఇంధన వనరులు, ఆరోగ్య రంగానికి సంబంధించిన వినూత్న నమూనాలు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉన్న ప్రతిభను వెలికితీయడం అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలను వెలికితీసి వాటిని వ్యాపార మార్గాలుగా మలచడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ఆవిష్కర్తలతో ప్రత్యక్షంగా చర్చించి వారి ఆలోచనలను మరింత మెరుగుపరుచుకునే విధంగా మార్గనిర్దేశం చేసింది. ఐడియా వ్యాలిడేషన్, ప్రోటోటైపింగ్, గో–టు–మార్కెట్ స్ట్రాటజీ, నిధుల సమీకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆవిష్కర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం వినూత్న ఆలోచనలతో పాల్గొన్న యువకులు, విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి వారి ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఆవిష్కర్తలను అధికారులు మెమెంటోలు, పూల మొక్కలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రమేష్, డిపిఆర్ఓ ఇ. విష్ణువర్ధన్, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఈడీఎం రవి, రెడ్కో డి.ఎం శ్రీనివాస్, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ నికినీ వర్మ, TGIC ప్రతినిధులు ప్రణయ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రతిష్టించిన ధ్వజస్తంభం.

## పాల్గొన్న టీపిసిసీ డెలిగేట్ సుజిత్ రావు

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్



మల్లాపూర్ అమృత్ తెలంగాణ మార్చి 14: ఈరోజు మొగిలిపేట గ్రామంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన ద్వజస్తంభం కార్యక్రమంలో పాల్గొనీ స్వామివారిని దర్శించుకున్న టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు వారితో పాటు మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,మాజీ ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రాములు,మాజీ విడిసి చైర్మన్ మహబూబ్ ఖాన్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ అమ్ముల పవన్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్,కల్లెడ గంగాధర్ మరియు గంగపుత్ర సంగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ద్రోహి తుంగతుర్తి ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 14:తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వేద ఆశీర్వచనం చేసిన బ్రాహ్మణులపై బూతు పదాలు వాడినందుకు క్షమాపణలు చెప్పాలని అఖిల బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం తాసిల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గాంధీభవన్లో 12వ తేదీన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణకు ఎస్సీ సెల్ చైర్మన్ గా పదవి ప్రమాణ స్వీకారం జరిగిన సభలో బ్రాహ్మణులు మానకొండూరు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ బాపనోళ్ళు చదివిన మంత్రాల్లో లం కొడుకు లాంటి బూతు పదాలు పలికారు. ఈ సభలో అడ్లూరి లక్ష్మణ్ పొన్నం ప్రభాకర్ తదితర మంత్రులు పలువురు దళిత ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. బహిరంగంగా వేదమంత్రాల అర్థం తెలుసుకోకుండా వేద ఆశీర్వచనం చేసిన బ్రాహ్మణులను పరుష పదజాలంతో ఆయన మాట్లాడడం సరి కాదని అన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ వేద ఆశీర్వచనం చేసి శతమానం భవతి లాంటి వేదవాక్కులు పలికిన బ్రాహ్మణులను వేదాలను కించపరిచే విధంగా మాట్లాడాన్ని ఖండిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సభలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు కూడా వింటూ ఉండగా ఇలాంటి పరుష పదాలు వాడిన వ్యక్తిని ఎవరు కూడా అడ్డుకోలేకపోవడం ఇది హిందూ ధర్మం దౌర్భాగ్యం అని అన్నారు. ఏ మతంలో అయినా ఆశీస్సులు అందజేసేటప్పుడు తిట్ల పురాణం ఉండదని అన్ని మతాలు మంచినే బోధిస్తాయని తుంగతుర్తి ఎమ్మెల్యే తెలుసుకుంటే బాగుంటుందని అన్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి తాము వెనుకాడమని కరాకండిగా తెలిపారు. ప్రతి బ్రాహ్మణుడు లోకాసమస్తా సుఖినోభవంతు అందరూ బాగుండాలని ప్రతినిత్యం కోరుకుంటారని అలాంటి బ్రాహ్మణులను దుర్భాషలాడడం తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఆ పదవికి ఆయన అనర్హుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు గాని ఎమ్మెల్యేలు గానీ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు మౌనంగా ఉంటే వారు హిందూ ధర్మానికి వ్యతిరేకులని ముద్రపడే అవకాశం ఉందని ఇది గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఎవ్వరైనా తమ పదవిని చూసుకొని నోటికొచ్చినట్లు మాట్లాడితే వాళ్లకు సరియైన బుద్ధి చెప్పే సామర్థ్యం తమకుందని బ్రాహ్మణ సంఘం నాయకులు మరోసారి హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఆది జాంబవ పరియోజన ప్రాంత ప్రముఖ అలగుర్తి లక్ష్మీనారాయణ బ్రాహ్మణ సంఘ నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ మాట్లాడుతూ బీసీ సీ గ్రూపుకు చెందిన వ్యక్తి తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ ఎస్సీ సర్టిఫికెట్ తో ఎమ్మెల్యేగా గెలుపొందారని మొట్టమొదట ఆయన రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు దీనివల్ల దళిత జాతికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వేదాల అర్థం తెలుసుకొని మాట్లాడాలని మందుల సామెల్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మోతే ఉమాకాంత్ శర్మ, నాయకులు సిరిసిల్ల రాజేందర్ శర్మ, సురేష్ శర్మ, సంగనభట్ల గుండయ్య శర్మ మేడిపల్లి శ్రీనివాస్ శర్మ, నేరెళ్ల శ్రీనివాస్ చారి, మెట్ట కిరణ్ భాస్కర్ శర్మ, కొత్తపల్లి శ్రీనివాస్ శర్మ గుండి శ్రీనివాస్ శర్మ, కొత్తపెల్లి రాజశేఖర్ , రుద్రాంగి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన వాకిటి సత్యం రెడ్డిని పరామర్శించిన పలువురు కాంగ్రెస్ నాయకులు.





మల్లాపూర్ అమృత్ తెలంగాణ మార్చి 14:ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు గాయపడిన రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డిని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజెంగి నందయ్య పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన సంగతి తెలుసుకొని మాజీ మంత్రివర్యులు జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పురాతన కాలంలో ప్రతిష్టించిన విగ్రహం తొలగింపు

నవాబు పేట : మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ పక్కనే ఉన్న పొలంలో పురాతన విగ్రహం (ముక్కిడిద్యావర) అనే విగ్రహాన్ని పట్టాదారు తన పొలంలో ఉందని వెంచర్ చేసే సమయంలో అనూకూలంగా లేదని ఎవరికి తెలియకుండానే తొలగించారని అదే గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు భూమి యజమాని తీరుపై, హిందువుల మనోభావాల దెబ్బతిన్నాయని గ్రామస్తులు మండిపడ్డారు. గతంలో పూర్వీకులు ఎంతో పవిత్రంగా భావించే అతి పురాతనమైన విగ్రహాలను ఆరాధన చేస్తూ గ్రామ ప్రజల క్షేమం, ఆరోగ్యం, బాగోగులను పురాతన కాలంలో ప్రతిష్టించిన దేవతలు ప్రజలును కాపాడే వారని నమ్మకంగా ఉండడం విశేషం భావించే వారు పెద్దలు మాట్లాడుతుండేవారని అన్నారు. వెంటనే ఆ పురాతన విగ్రహం తొలగింపును విరమించుకోవాలని విగ్రహం పునః ప్రతిష్ట చేయాలని డిమాండ్ చేశారు.

# దేశాన్ని ఏకం చేసేదే మన సంస్కృతి.

## ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యులు దక్షిణామూర్తి.






జగిత్యాల, అమృత్ తెలంగాణ మార్చి 14: కులం, మతం, భాష, వేషం ఏదైనా మన సంస్కృతి ఒకటేనని భారతదేశాన్ని ఏకం చేసే మన భారతీయ సంస్కృతినీ కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్రీయ స్వయంసేవక సంఘం తెలంగాణ ప్రాంత కార్యకారిని సభ్యులు బూర్ల దక్షిణామూర్తి అన్నారు. ఆర్ఎస్ఎస్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉగాది ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ స్వయం సేవకులు పూర్ణ గనవేశతో నగరంలో పథసంచలనం నిర్వహించారు. గీత విద్యాలయం నుండి ఒక వాహిని, హనుమాన్ వాడ బీరప్ప టెంపుల్ నుండి మరోవాహిని పథసంచలనం నిర్వహిస్తూ తాసిల్ చౌరస్తా వద్ద ఒకటిగా కలిసిపోయి విద్యానగర్ రామాలయం వరకు చేరుకన్నారు. దారి పొడవున మహిళలు భగవద్వజానికి పూలు చల్లి స్వాగతం పలికారు. అనంతరం విద్యానగర్ రామాలయ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఓరుగంటి నితిన్ రావు పాల్గొనగా ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ డాక్టర్ భీమనాతిని శంకర్, జిల్లా సంఘచాలక్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, నగర సంఘచాలక్ పురుషోత్తం పాల్గొన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న బూర్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ ఎన్నో వేల సంవత్సరాల గొప్ప చరిత్ర కలిగిన భారతదేశాన్ని మన అనైక్యత కారణంగా విదేశీయులు పరిపాలించారన్నారు. దేశానికి ఎప్పుడు ఆపద కలిగినా మహనీయులు జన్మించి దేశాన్ని కాపాడారని తెలిపారు. గ్రీకులు, హునులు, కుషానులు, శకులు, మొగలులు, ఆంగ్లేయులు తదితర విదేశీయులను ఎదిరించి శాలివాహనుడు, విక్రమాదిత్య మహారాజు, రాణా ప్రతాప్ శివాజీ లాంటి మహావీరులు మన దేశాన్ని కాపాడారని తెలిపారు. రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి, వివేకానంద, శంకరాచార్య లాంటి వ్యక్తులు సనాతన హిందూ ధర్మాన్ని కాపాడారని వివరించారు. సంస్కృతి ఎంత గొప్పదైనా దానిని కాపాడుకునే సమాజం లేనట్లయితే ఆ దేశం మనుగడ అసాధ్యమని, దీనిని దృష్టిలో పెట్టుకొని డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని 100 సంవత్సరాల క్రితం ప్రారంభించాడని వివరించారు. ప్రతిరోజు ఒక గంట సేపు శాఖా కార్యక్రమాల ద్వారా వ్యక్తి నిర్మాణ కార్యాన్ని ఆర్ఎస్ఎస్ చేపడుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ ద్వారా శిక్షణ పొందిన ఎంతోమంది స్వయం సేవకులు సమాజంలోని అన్ని జీవన రంగాల్లో తమ ప్రభావాన్ని చూపుతూ ఈ దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఒకప్పుడు హిందువులు ఒక్కటిగా కలిసి ఉండే పరిస్థితి ఉండేది కాదని 100 సంవత్సరాల ఆర్ఎస్ఎస్ కృషి వల్ల నేడు లక్షలాది హిందువులు గర్వంగా తాము హిందువునని చెప్పుకుంటున్నారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ చేపట్టే సేవా కార్యక్రమాల ద్వారా సంఘాన్ని వ్యతిరేకించే వారు సైతం సంఘ కార్యక్రమాల్లో,పాల్గొంటున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ ను పూర్తిగా వ్యతిరేకించిన మొదటి ప్రధాని నెహ్రూ చైనా యుద్ధంలో భారత సైన్యానికి ఆర్ఎస్ఎస్ అందించిన సేవలకు గుర్తింపుగా 1963 జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్వయం సేవకులను ఆహ్వానించారని గుర్తు చేశారు. అంటరానితనం, ఉచ్చ, నీచ, బేధ భావం సంఘంలో లేవని అందరూ సమానం అనే భావన ఆర్ఎస్ఎస్ లో ఉంటుందనే విషయాన్ని డాక్టర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ సంఘ శిబిరాలను సందర్శించడం ద్వారా తెలుసుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు నిత్య శాఖలో పాల్గొని దేశం కోసం, ధర్మం కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన 500 మంది గణ వేషధారి స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు.

# పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్: డా. రఘు



కోరుట్ల అమృత్ తెలంగాణ మార్చి 14: నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ముఖ్యమైన దశ అని అన్నారు. విద్యార్థులు భయం, ఆందోళనలకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఇప్పటివరకు చేసిన కృషి,

సాధనపై నమ్మకం ఉంచుకుని ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ధైర్యం చెప్పి ప్రోత్సహించాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులు, పాఠశాలలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలిపారు

# సఫాయి కార్మికులకు సన్మానాలు......

## వారిని గౌరవంగా సన్మానించడం నా అదృష్టంగా భావిస్తున్న సర్పంచ్ ప్రవీణ్ పటేల్.........



పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానిస్తున్న కుస్లి గ్రామపంచాయతీ పాలకవర్గం

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 14 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులను గ్రామ సర్పంచ్ ప్రవీణ్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామ అభివృద్ధిలో వారి కృషి అభినందనీయం గ్రామ ప్రజలు ఈరోజు ఆరోగ్యంగా మలేరియా డెంగు వంటి ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నాము అంటే వారు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామ శుభ్రత కొరకు కృషి చేస్తూ మన అందరిని ఆరోగ్యంగా ఉంచుతున్నందుకు వారికి నా యొక్క ధన్యవాదాలు తెలుపుతున్నాను వారిని సన్మానించడం నాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉపసర్పంచ్ ఆలూరి రాజు, నాగభూషణ్ గంగాధర్, ప్రవీణ్, నారాయణ, వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# ఘనంగా దేవి విద్యోదయ విద్యాలయం 23వ వార్షికోత్సవం వేడుకలు

మల్హర్ రావు:- అమృత్ తెలంగాణ: కొయ్యూరులోని దేవి విద్యోదయ విద్యాలయం 23వ వార్షికోత్సవం వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్యఅథిదిగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మేన్ అయిత ప్రకాశ్ రెడ్డి పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. పిల్లలు చక్కగ చదివి ప్రయోజకులు కావాలని,అలాగే పాఠశాల మరింత అబివృద్ధిచెందాలని,నాణ్యమైన విద్యాను అందించాలని సూచించారు. కర్స్‌పాండెట్ కుడుదుల రాజు మాట్లడుతు..23సంత్సారాలు పూర్తి చేసుకోని 24వ వార్షికోత్సవంలోకి అడుగిడుతుందని ఈ ప్రయాణానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ఈ 23సంత్సారాలుగా విద్యార్థులు సాదించిన విజయాలను వివరించారు. కొయ్యూరు ఎస్ఐ2 రాజన్ మాట్లడుతు.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని,చెడు వ్యసనాలజోలికి పోకుండా తల్లిదండ్రుల కష్టాన్ని వృదా చేయకుండా మంచి పేరు తీసుకరావాలని కోరారు. ఈ వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక ,నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకారక్షణగా నిలిచాయి. కిండర్ గార్టెన్ గ్రాద్యుయేషన్ వేడుక యువ గ్రాద్యుయేట్లకు గర్వకారణంగా నిలిచింది, వారు అతిథుల నుండి ప్రశంసలు, ఆశీర్వాదాలు పొందారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల పిటిఏ అధ్యక్షుడు డి. శ్రీధర్, కొయ్యూర్ సర్పంచ్ కొండన్ రాజమ్మ, ఉప సర్పంచ్ ఎల్. సవేందర్, వల్లేంకుంట సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ కటకం స్వప్న నరేష్, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# రెడ్ హాట్ బికినీతో కిల్ చేసిన దిశా పటానీ




రెడ్ హాట్ లుక్ తో వేడి పెంచడంలో దిశా పటానీని కొట్టేవాళ్లే లేరు. ఈ అందాల భామ బీచ్ బికినీ షోలకు అంతూ దరీ లేదు. నిరంతర వెకేషన్లతో యువతరానికి బోలెడంత ట్రీటిస్తోంది. తాజాగా మరోసారి బీచ్ లో దిశా పటానీ అందాల ఆరబోతలో చెలరేగిపోయింది. రెడ్ హాట్ బికినీ ధరించి అలా ఇసుక తిన్నెల్లో శయనించిన దిశా పటానీ ఫోజులు వైరల్ గా మారాయి. ఈ లుక్ లో దిశా పటానీ తన మేకప్ ను సింపుల్ గా ఉంచుతూ బంగారు చెవిపోగులు మెడలో బంగారు చైన్ తో స్పెషల్ గ్లామ్ ని యాడప్ చేసింది. దిశా పటానీ తన అద్భుతమైన ఫోటోగ్రాఫ్ లతో తన అభిమానుల హృదయాల్ని కొల్లగొడుతోంది. ఈ ఫోటోలను పోస్ట్ చేస్తూ తాను నిజమైన బీచ్ బేబ్ అని ప్రకటించింది. నెట్ ఫ్లిక్స్ యే కాళీ కాళీ ఆంఖేన్ దిశా పటానీని ఆకర్షించినట్లు కనిపిస్తోంది. షో- థీమ్ ట్రాక్ లో తాను డ్యాన్స్ చేస్తున్న వీడియోను షేర్ చేయడానికి దిశా తాజాగా ఇన్ స్టాగ్రామ్ లోకి వెళ్లింది. నెట్ ఫ్లిక్స్ సిరీస్ కి షారుఖ్ ఖాన్ బాజీగర్ చిత్రంలోని యే కాళీ కాళీ ఆంఖేన్ ఐకానిక్ పాట ను యాడప్ చేశారు. తన వీడియోతో దిశా YKKAGroove Instagram రీల్స్ ఛాలెంజ్ ని ప్రారంభించింది. ఇదే విషయం గురించి దిశా మాట్లాడుతూ నేను 90ల నాటి థ్రిల్లర్ ల అభిమాని - ఆకట్టుకునే సంగీతం- డ్రామా - యాక్షన్ - అవన్నీ మిమ్మల్ని కట్టిపడేసే పూర్తి ఎంటర్ టైనర్ లు. యే కాళీ కాళీ ఆంఖేన్ వీటి నుండి ప్రేరణ పొందుతుంది! నేను ఎప్పుడు Netflix కూడా ఐకానిక్ తరహా రెండిషన్ తో వస్తోందని విన్నాను.

# అప్పుడు మామ.. ఇప్పుడు అల్లుడు.. అమ్మడు సందడే సందడి!

ఇప్పుడు అల్లుడు సరసన నటిస్తోంది. మరో హిట్ కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఎవరో కాదు మీనాక్షీ చౌదరి. మొన్న మామయ్యతో బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించిన ఆ హీరోయిన్.. ఇప్పుడు అల్లుడు సరసన నటిస్తోంది. మరో హిట్ కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఎవరో కాదు మీనాక్షీ చౌదరి. విక్టరీ వెంకటేష్ హీరోగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో 2025ను సక్సెస్ ఫుల్ గా స్టార్ట్ చేసిన అమ్మడు.. నాగచైతన్య అప్ కమింగ్ మూవీలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే మామాఅల్లుళ్లతో వెంటవెంటనే స్క్రీన్ షేర్ చేసుకున్న హీరోయిన్స్ లో మీనాక్షీ చౌదరి ఒకరు. అదే సమయంలో నాగచైతన్య రీసెంట్ గా తండేల్ తో ఎలాంటి హిట్ అందుకున్నారో అందరికీ తెలిసిందే. శ్రీకాకుళానికి చెందిన కొందరు మత్స్యకారుల నిజజీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా చందూ మొండేటి తెరకెక్కించిన ఆ మూవీతో రూ.100 కోట్ల విజయాన్ని సాధించారు. స్టార్ బాయ్‌కి అది బిగ్ ఛాలెంజ్‌గా మారిందిగా! దీంతో ఇప్పుడు చైతూ అప్ కమింగ్ ప్రాజెక్ట్ 24పై అందరి ఫోకస్ పడింది. కొంత కాలం క్రితం రిలీజ్ అయిన విరూపాక్షతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ కార్తీక్ దండుతో సినిమా చేయనున్నారు నాగ చైతన్య. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ గా.. గ్రాండ్ గా సినిమా రూపొందనున్నట్లు కొద్ది రోజుల క్రితం వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. సినిమాలో చైతన్య రెండు కోణాలు ఉన్న రోల్ లో కనిపించనున్నారని తెలుస్తోంది. ఫుల్



గా మేకోవర్ చేసుకోనున్నారని సమాచారం. దీంతో కెరీర్ లో నెవ్వర్ బిఫోర్ పాత్రలో నటించనున్నారని వినికిడి. ఆయన సినీ కెరీర్ లోనే భారీ బడ్జెట్ సినిమా కానుందని, గ్రాఫిక్స్ పనుల కోసమే బడ్జెట్ లోని ఎక్కువ భాగం ఖర్చు చేయనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే విరూపాక్షలో తన దర్శకత్వ ప్రతిభ అంటే ఏంటో చూపించిన కార్తీక్ వర్మ.. పౌరాణికాలను, సస్పెన్స్ మిళితం చేసే మరో ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ గా %చీజ% 24ను అందించాలనే ఆసక్తిగా ఉన్నారని సమాచారం. మొత్తానికి చైతూ త్వరలోనే మరిన్ని అప్డేట్స్ తో మేకర్స్ సందడి చేయనున్నారని తెలుస్తోంది. దీంతో సినిమా కోసం అంతా వెయిట్ చేస్తున్నట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.







# నభానటేష్ హాట్ టాప్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com